# పోతనభాగవతంలో రసగుళికలు



– ఆర్.శర్మ దంతుర్తి

## 78 వ భాగం

### వృత్తాసుర వృత్తాంతం – 2, దక్షుడి సృష్టి

చంద్రుడు మారిష అనే ఆవిడని ప్రాచేతసనులకి ఇచ్చాక వాళ్లకి దక్ష ప్రజాపతి పుట్టాడు. ఈయన మొత్తం జీవకోటికి ఆద్యుడన్నమాట. అంటే మానవులనుంచి మిగతా అనేకానేక జీవులకి ఈయనే కారకుడు.

క. నర సుర గరు డోరగ కి
న్నర దానవ యక్ష పక్షి నగ వృక్షములం
దరమిడి సృష్టి యొనర్చెను
దిరముగ దక్షప్రజాపతి వితతకీర్తిన్. [6-207]

నరులు, సురలు, గరుడులు, దానవ, యక్ష, కిన్నెర, పక్షి సంతుతలన్నింటినే సృష్టించాడీయన. సృష్టి ఎలా సాగిందనేది కూడా చెప్తున్నారు – తిరముగ (స్థిరంగా), దరమిడి (వరుసగా).

క. బహువిధముల బహుముఖముల
బహురూపములైన ప్రజల బహులోకములన్
బహుళముగఁ జేసి మదిలో
బహుమానము నొందఁ డయ్యె బ్రఖ్యాతముగన్. [6-208]

భగవంతుడు తననెందుకు పుట్టించాడో అలాగే అనేక విధాల, అనేక రూపాలున్న ప్రజోత్పత్తి చేసాక కూడా మనసులో సంతోషం లేదు. అంటే కొంత వయసు వచ్చాక మనకి కలిగే ఈ వైరాగ్యం ఆయనకి కలిగింది. దీనిక్కారణం సులభంగా చెప్పుకోవచ్చు. జీవితం గడిచేకొద్దీ నా వల్ల ఈ ప్రజోత్పత్తి తప్ప మరోటి ఏమి జరిగింది, నాకేం మిగిలింది అనే ఆలోచనలు వచ్చేసరికి భగవంతుడు తప్ప మరోదారి లేదు శాంతికి అనే ఆలోచన రాగానే ఏం చేయాలో నిర్ణయించుకోవాలి కదా?

తే. ఆ ప్రజాసర్గ బృంహితం బయిన జగము
దక్షుఁ డీక్షించి మదిలోనఁ దాప మొంది
మఱియు జననంబు నొందించు మతము రోసి
పరమపురుషుని నాశ్రయింపంగఁ దలఁచె. [6-209]

ఇదే బ్రహ్మచర్యం, గార్హస్యం, వానప్రస్థం, సన్యాసం అనేవి అనుకుంటే, దక్షుడికి ఈ జగం చూసి మనసులో తాపం మొదలైంది. ఇలా చేయడం కంటే పరమపురుషుని ఆశ్రయించడం మంచిది అని తెలుసుకున్నాడు.

క. మోదం బై పరిదూషిత
ఖేదం బై శాబరీర్ధ కిలికించిత దృ
గ్భేదం బై బహుసౌఖ్యా
పాదం బై యొప్పు వింధ్యపాదంబునకున్. [6-211]

వ. అరిగి, యందఘమర్షణం బను తీర్థంబు సర్వదురితహరం బయి యొప్పుదాని ననుసవనంబు సేవించి, యతి ఘోరం బయిన తపంబు చేయుచు హరిం బ్రసన్నుం జేసి, హంసగుహ్యం బను స్తవరాజంబున నిట్లని స్తుతియించె. [6-212]

అలా తెలుసుకున్నాక సంసారం వదిలేసి వింధ్య పర్వత శ్రేణిని చేరుకున్నాడు తపస్సుకోసం. ఆ వింధ్య ఎటువంటిది? ఆనందాన్ని ఇచ్చేది (మోదంబై), మనస్తాపాన్ని పోగొట్టేది (పరిదీషిత ఖేదంబై), శబరస్త్రీల (శాబరీర్ధ) కిలకిలారావాలు (కిలికించిత) చేస్తూ విలాస వీక్షణాలను ప్రసరింపజేసేది, మిక్కిలి సుఖకరమైనది (బహు సౌఖ్యాపాదంబై). అలా ఘోరమైన తపస్సు చేసి శ్రీహరిని ప్రసన్నం చేసుకున్నాడు. ఆయన కనిపించాక హంసగుహ్యం అనే స్తవం తో ఇలా అంటున్నాడు దక్షుడు.

ఉ. పూని మనంబునుం దనువు భూతములున్ మఱి యింద్రియంబులుం
బ్రాణములున్ వివేక గతిఁ బాయక యన్యముఁ దమ్ము నెమ్మెయిం
గానఁగనేర వా గుణనికాయములం బరికించునట్టి స
ర్వానుగతున్ సమస్తహితు నాదిమపూరుషు నాశ్రయించెదన్. [6-216]

మనస్సు, పంచభూతాలు, ఇంద్రియాలతో ఉన్న జీవులు ఈ దేహమే (తనువు) తాము అనుకుంటున్నారు. అయితే వివేకం కలిగాక ఇది కాదు దీనికి అన్యంగా మరోటి ఏదో ఉంది అని తెలుస్తోంది. ఇవన్నీ పరికించి చూసే సర్వం అనుసరించేవాడినీ (సర్వానుగతిన్), అన్నింటికీ హితుడైనవాడినీ (సమస్త హితున్), అన్నింటికి మూల కారణమైనవాడినీ (ఆది పూరుషునన్) ఆశ్రయిస్తాను. ఇదంతా ఎందుకని ఓ సారి ఆలోచిస్తే మనకి తెలిసేదేమంటే, జీవితంలో ఎన్ని సాధించినా, శాంతి అనేది కావాలంటే ఏదో సంపాదించి కూడబెట్టడం, కులం, సంతంతి పెంపు చేసుకోవడం కాదనీ, ఈ శరీరం కంటే ఆవల ఏదో ఉంది, ఏది తెలుసుకుంటే మరేం తెలుసుకోనక్కర్లేదో అది తెలుసుకుంటే శాంతి కలుగుతుందనీ వివేకం రావడం – ముముక్షత్వం అన్నమాట. దీనినే బుధ్ధుడి భోధనల్లో గమనించవచ్చు – 'నీకు నువ్వే ఏమీ కానప్పుడు ఎవరికెవరు?' అంటాడు బుధ్ధుడు. అంటే ఈ శరీరం నీది కాదు, మనస్సు, ఇంద్రియాలూ అసలే కావు. నీవు కేవలం జ్ఞానస్వరూపుడవి అని చెప్పడం అన్నమాట. అది వచ్చాక మనసు భగవంతుడి మీదకి మళ్ళుతుంది. అది జరిగాక భగవంతుణ్ణి ఆశ్రయించడం; ఇదే మనకి గజేంద్ర మోక్షంలో కరి చివరి దాకా పోరాడాక 'ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు లీనమై...' అనే పద్యంలో కనిపిస్తుంది కూడా.

ఇంతవరకూ వచ్చాక మన మనసులోకొచ్చే భగవంతుడెటువంటివాడనే గుణాలని కింద వచనంలో అద్భుతంగా వివరుస్తున్నాడు సింగయ. పోతన వచనానికి దీటుగా రాసినదీ వచనం – జ్ఞానం కలిగాక భగవద్దర్శనం ఎలా ఉంటుందో అనేది వివరంగా రాసినది.

వ. మఱియు; ననేకవిధ నామ రూప నిరూప్యంబగు మనంబునకు దృష్టస్మృతుల నాశంబువలనఁ గలిగెడు నుపరామం బగు సమాధి యందుఁ గేవల జ్ఞానస్వరూపంబునఁ దోచు నిర్మల ప్రతీతిస్థానంబైన హంసస్వరూపికి నమస్కరింతు; దారువందు నతి గూఢంబైన వీతిహోత్రుని బుద్ధిచేతం బ్రకాశంబు నొందించు భంగి, బుద్ధిమంతులు హృదంతరంబున సన్నివేశుం డయిన పరమపురుషుని నాత్మశక్తిత్రయంబులచేతం దేజరిల్లఁ జేయుదురు; అట్టి దేవుండు, సకల మాయావిచ్ఛేదకం బయిన నిర్వాణ సుఖానుభవంబునం గూడి యుచ్చరింపం గొలఁదిగాని శక్తిగల విశ్వరూపుండు నాకుం బ్రసన్నుండగుంగాక; వాగ్బుద్ధీంద్రియ మానసంబులచేతం జెప్పను, నిట్టి దని నిరూపింపను, నలవిగాక యెవ్వని గుణరూపంబులు వర్తించు, నెవ్వండు నిర్గుణుండు, సర్వంబు నెవ్వనివలన నుత్పన్నంబగు, నెవ్వనివలన స్థితిం బొందు, నెవ్వని వలన లయంబగు, నట్టి పరాపరంబులకుం బరమంబై, యనన్యంబై, ప్రాక్ప్రసిద్ధంబై, సర్వవ్యాపకంబై, యాదికారణంబై యున్న తత్త్వంబు నాశ్రయింతు; ఎవ్వని ప్రభావంబు మాటలాడెడు వారలకు, వాదంబు చేయువారలకు వివాద సంవాదస్థలంబు లగుచు నప్పటప్పటికి మోహంబు నొందించుచుండు, నట్టి యనంతగుణంబులు గల మహాత్మునకుం బ్రణామంబు చేయుదు; అస్తి నాస్తి యను వస్తుద్వయ నిష్ఠలం గలిగి, యొక్కటన యుండి విరుద్ధ ధర్మంబులుగఁ గనంబడు నుపాసనా శాస్త్ర సాంఖ్యశాస్త్రంబులకు సమంబై, వీక్షింపఁదగిన పరమంబు నాకు ననుకూలంబగు గాక, ఎవ్వఁడు జగదనుగ్రహంబుకొఱకు జన్మ కర్మంబులచేత నామరూపంబు లెఱుంగంబడ కుండియు, నామరూపంబులు గలిగి తేజరిల్లు, నట్టి యనంతుడయిన భగవంతుండు ప్రసన్నుండగుం గాక; ఎవ్వండు జనులకుఁ బురాకృత జ్ఞాన పదంబుల చేత నంతర్గతుండై, మేదినిం గలుగు గంధాది గుణంబుల నాశ్రయించిన వాయువు భంగి మెలంగుచుండు నా పరమేశ్వరుండు మదీయ మనోరథంబు సఫలంబు జేయు గాక" యనుచు భక్తి పరవశుండయి యుక్తి విశేషంబున స్తుతియించుచున్న దక్షునికి భక్తవత్సలుం డైన శ్రీవత్సలాంఛనుండు ప్రాదుర్భావంబు నొందె; అప్పుడు. [6-217]

అనేకానేక నామరూపాలు దృష్టి, స్మృతుల వల్ల కలిగేవి నాశనం అయ్యాక కలిగే సమాధిలో భగవంతుడు కనిపిస్తాడుట. ఎలా? జ్ఞాన స్వరూపంగా. ఈ విషయం కొంచెం నిశితంగా చూద్దాం. శుకమహర్షి మొదట్లో ఏం చెప్పాడు? 'హరిమయము విశ్వమంతయు, హరి విశ్వమయుండు ..' అని కదా? కానీ హిరణ్యకశిపుల సంతతి అయిన మనకి ఈ సృష్టి అలా కనిపించదే? ఎందుకంటే మన మనస్సు అలాంటిది. ఈ ప్రపంచంలో మనకి కనిపించేదేమిటని చూస్తే అది మనస్సు కల్పించే భావన. అయితే భవగంతుణ్ణి చూసినవారికి కనిపించేదేమిటి? వారికి జ్ఞాన స్వరూపమైన భగవంతుడు తప్ప మరోటి కనపడదు. దీనికి ఉదాహరణలు భాగవతం చెప్పే శుకమహర్షి దగ్గిర్నుండి, శ్రీరామకృష్ణులు, చైతన్య మహాప్రభువూ, శివానందులవంటివారే. మనసునెప్పుడైతే ఆత్మలోకి చూడ్డానికి అలవాటు చేస్తామో అప్పుడు మనస్సు సృష్టించుకున్న ఈ నామరూపాలు నాశనమై వాటి వెనకనున్న జ్ఞానస్వరూపం గోచరమవడం అన్నమాట. మరి దీన్ని ఎలా చూడడం నేర్చుకోవడం?

దీనికి మరికాస్త వివరణ. ఎండుకట్టెలలో (దారువు) అగ్నిహోత్రుడు అంతరంగా ఎలా ఉన్నాడో భగవంతుడలా ఉన్నాడు ప్రతీ ప్రాణిలోనూ. అగ్నితో ఆ ఎండుకట్టెని కాల్చినట్టే, ఈ మనస్సనేదాన్ని నశింపచేయగల్గితే లోపలున్న భగవంతుడు ప్రకాశించడం మొదలుపెడతాడు. దేహంలో ఉన్న భగవంతుణ్ణి, జ్ఞానాన్ని (హృదంతరంబున సన్నివేశుం డయిన పరమపురుషుని) వివరించడానికి, మంత్రపుష్పంలో – "నీలతోయద మధ్యస్థా విద్యుల్లేఖేవ భాస్వరా, నీవార శూక వత్తన్వీ పీతాభాస్వత్యణూపమా, తస్యాశిఖాయా మధ్యే పరమాత్మా వ్యవస్థితః.." చెప్పడం గమనించవచ్చు. ఇటువంటి భగవంతుడు – ఇంత అని చెప్పలేని శక్తి స్వరూపుడు (యుచ్చరింపం గొలఁదిగాని శక్తిగల విశ్వరూపుండు). నిర్గుణుండైన ఆ భగవంతుడు మనోవాక్కాయ కర్మలకి అతీతుడు. త్యాగరాజు చెప్పిన వాచామగోచరుడు ఈయనే. అయితే భగవంతుడి గురించి వాదోపవాదాలు చేసేవారికీ, వివాదాలు కలిగించేవారికీ ఆయన ఎప్పటికీ అందకుండా మోహం కలిగిస్తూనే ఉంటాడు (గమనించారా, భగవంతుణ్ణి తెలుసుకోవాలంటే బుద్ధి, మనస్సు ఇంద్రియాలు ఎప్పటికీ పనికిరావు, శరణు అనడమే చివరి మార్గం). అందుకే అటువంటి అనంతమైన గుణాలు కలవాడికి నమస్కారం. అలా చెప్పాక ఇప్పుడు అటువంటి భగవంతుడు నా పట్ల ప్రసన్నుడవుగాక అని ప్రార్థన చేసాడు దక్షుడు.

సీ. కుండల మణిదీప్తి గండస్థలంబులc;
బూర్ణేందురాగంబుc బొందుపఱుప
దివ్యకిరీట ప్రదీప్తులంబర రమా;
సతికి గౌసుంభవస్త్రంబు గాcగ
వక్షస్థలంబుపై వనమాలికాశ్రీలు;
శ్రీవత్స కౌస్తుభ శ్రీల నొఱయ
నీలాద్రిc బెనcగొని నిలిచిన విద్యుల్ల;
తల భాతిc గనకాంగదంబు మెఱయ [6-219]

ఆ. నఖిలలోక మోహనాకార యుక్తుcడై
నారదాది మునులు జేరి కొలువc
గదిసి మునులు పొగడ గంధర్వ కిన్నర
సిద్ధ గాన రవము చెవుల నలర. [6-219.1]

భగవంతుడు కనిపించడానికి ఏం చేయాలో చెప్పాడు కదా, అలా జ్ఞాన చక్షువు తెరుచుకున్నాక కూడా భగవంతుడు కనిపించకపోవచ్చు. ఎందుకంటే ఎన్నోవేల జనంలో ఒకడు భగవంతుడి గురించి ప్రయత్నం చేస్తాడు. అలా ప్రయత్నించినవారిలో ఒకానొకరికి మాత్రమే భగవద్దర్శనం కలుగుతోంది (మనుష్యాణాం శహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే, యతతామపి సిద్ధానాం, కశ్చిన్మాం వేత్తి తత్వతః – భగవద్గీత జ్ఞాన విజ్ఞాన యోగం 7-3). అంటే ముముక్షత్వం వచ్చాక సన్యాసం తీసుకుని జ్ఞానం సంపాదించాక– భగవంతుణ్ణి సాక్షాత్తూ చూడడానికి, ఆ విజ్ఞానం రావడానికి భగదనుగ్రహం తప్పనిసరి. అలా కనిపించిన భగవంతుణ్ణి మన పోతన ఎప్పుడూ కూడా ఒకే రకమైన వివరణతో చెప్పడం చూడవచ్చు – కిరీట మకరకుండల కేయూర హార కటక కౌస్తుభ మణిమేఖలాంబర వనమాలికా విరాజితుండు. దీనినే సింగయ కూడా పై సీస పద్యంలో వివరించాడు. అలా కనిపించిన భగవంతుడు – నారాయణీయంలో భట్టాత్తిరి గారు చెప్పినట్టూ – యత్త్రైలోక్య మహీయసోపి మహితం సమ్మోహనం మోహనాత్ – అఖిలలోక మోహకారుడై ఉన్నాడు.

క. సర్వేశుcడు సర్వాత్ముcడు
సర్వగతుం డచ్యుతుండు సర్వమయుండై
సర్వంబుc జేరి కొలువcగ
సర్వగుc డక్షుడైనకుc బ్రసన్నుం డయ్యెన్. [6-220]

ఇలా కనిపించిన భగవంతుడు సర్వేశుడు (అన్నింటికీ ఈశ్వరుడు), సర్వాత్ముడు (అన్ని జీవుల్లో ఉండేవాడు. ఎందుకీ పదం అంటే విజ్ఞానం గోచరించాక మనకి కనిపించేదేమిటి అందరిలో? ఆత్మ స్వరూపం ఒకటే కదా, అదే హరిమయము విశ్వమంతయు, హరి విశ్వమయుండు..), సర్వగతుండు (అన్ని చోట్లా ఉండేవాడు. దీనినే ప్రహ్లాదుడు తండ్రికి చెప్పడం గమనించాం, అంబోజాసనుడాదిగాక తృణపర్యంతంబు విశ్వాత్ముడై సంబావంబుననుండ ప్రోడ విపుల స్థంభంబునందుండడే... అంటూ), అచ్యుతుండు (చ్యుతి, పతనంలేనివాడు), సర్వమయుండై (అన్నీ నిండినవాడు), అందరూ కొలుస్తూండగా (సర్వంబు జేరి కొలువ. దీనినే పోతన గజేంద్ర మోక్షంలో శ్రీహరి కరి రక్షణకి బయల్దేరి రావడంలో వివరించాడు, సిరికింజెప్పడు, శంఖ చక్రయుగమున్ జేదోయి సంధింపడే ... అంటూ), సర్వం వ్యాపించినవాడు (సర్వగుడై), దక్షుడికి కనిపించాడు. ఈ పద్యంలో సింగయ పోతనకి దీటుగా “సర్వ” అనే పదం పద్యం లో పూర్తిగా వాడడం గమనించారా?

ధ్రువుడు చిన్నతనంలో పినతల్లి అన్నమాటలకి మనసులో కలత చెంది తపస్సుకి వెళ్ళాక శ్రీహరి కనిపిస్తాడు. మనసులో కోరిక మాట అటుంచి 'ముందు అసలు కనిపించిన నిన్ను నేను కీర్తించాలనుకుంటున్నాను కానీ నేనేమీ చదువుకున్నవాణ్ణి కాదు' అనుకుంటూంటే, తన చేతిలో "జలధరనినద" (అంటే జలానికి ఆధారమైన మేఘం; అది చేసే ఉరుమువంటి శబ్దం వచ్చే పాంచజన్యమనే) శంఖాన్ని ధ్రువుడి దవడకి ఆనిస్తాడు అడగకుండానే; ప్రతీ క్షణం మన మనసులో కలిగే ఆలోచనలు తెల్సినవాడు కనక. అప్పుడు వేదాలకి మూలమైన ఆ శంఖ ప్రభావంతో సామవేదంతో విష్ణువుని కీర్తించాక 'నీకేం కావాలో కోరుకో' అంటే – అసలు తపస్సు ఎందుకు మొదలుపెట్టాడో మర్చిపోయి – "అనేక మాయా విశేషాలతో ఉండే నీ మనోహరమైన మోము అలా నిరంతరం చూస్తూ ఉండడం తప్ప ఇంకేమీ వద్దు" అని అడుగుతాడు. ఇదే శ్రీరామకృష్ణులు చెప్పడం ప్రకారం ఉప్పు బొమ్మ సముద్రం లోతు కొలవడానికి చేసే ప్రయత్నం అంటే. ఒకసారి భగవద్దర్శనం అయితే ఇంకేమిటి కోరుకునేది? అందులో లీనమవడమే. అయినా ప్రతీ క్షణం మన మనసులో కలిగే ప్రతీ ఆలోచనా తెలిసిన భగవంతుణ్ణి ఏమిటి కోరేది? అయితే అలా లీనమయ్యే విజ్ఞానం భగవంతుడి దగ్గిర్నుంచి ఎప్పుడొస్తుంది? ఆయన మనచేత చేయించుకునే పని పూర్తి అయ్యాక. అప్పటి వరకూ ఆయన కోసం పనిచేస్తూనే ఉండాలి; నేను కాదు నువ్వే అనుకుంటూ.

దక్షుడు ప్రజాపతిగా చేయవలసిన పని పూర్తైపోయిందా, ఇంకా చేయాల్సిన పని మిగిలి ఉందా? అది భగవంతుడికి తప్ప మరొకరికి తెలియదు. ఇప్పుడు కనిపించిన – సర్వంబుఁ జేరి కొలువఁగ సర్వగుడైన శ్రీహరి – దక్షుడికి ఏమి చెప్తాడో వచ్చే వ్యాసంలో.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS